క్లుప్తంగా

ఆండాళ్ తాయార్‌కు విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ తాయార్ తిరువాడిపూర్ర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో సోమవారం ప్రారంభించారు. తిరుమంజనం, ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవ తదితరాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా బాలాజీ, జయంతి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

వృద్ధ దంపతులకు ఆపన్నహస్తం



హెడ్ కానిస్టేబుల్ మస్తాన్

నెల్లూరు(క్రైమ్): నగదు బ్యాగ్‌ను పోగొట్టుకొని దిక్కుతోచని స్థితిలో ఉన్న వృద్ధ దంపతులను ఓ హెడ్ కానిస్టేబుల్ అక్కున చేర్చుకున్నారు. వారికి భోజనాన్ని అందించి.. చార్జీలకు నగదు ఇచ్చి చెన్నైకు పంపి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. చెన్నైలో నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రంజన్ తల్లిదండ్రులు బారాషహీద్ దర్గాలో గంధమహోత్సవానికి ఇటీవల హాజరయ్యారు. ఈ క్రమంలో నగదు, మొబైల్‌ఫోన్లు ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకున్నారు. దీని కోసం గాలించినా ప్రయోజనం లభించలేదు. ఈ తరుణంలో ఆకలి.. చెన్నై వెళ్లేందుకు డబ్బుల్లేక పోవడంతో అక్కడున్న వారిని ప్రాధేయపడసాగారు. గమనించిన ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ మస్తాన్ వారి వద్దకెళ్లి విషయాన్ని తెలుసుకున్నారు. వారికి భోజనం పెట్టించి రూ.500 నగదుతో పాటు ఆటో చార్జీలను ఇచ్చి రైల్వేస్టేషన్‌కు పంపారు. ఈ క్రమంలో డబ్బులు తిరిగి పంపేందుకు వివరాలను వృద్ధ దంపతులు అడగ్గా, తన పేరు మస్తాన్ అని తిరిగివ్వాల్సిన అవసరం లేదని చెప్పి వెళ్లిపోయారు. ఇంటికి క్షేమంగా చేరుకున్న దంపతులు జరిగిన విషయాన్ని తన కుమారుడికి వివరించారు. దీంతో ఆయన ఎస్పీకి లేఖ రాశారు. తోడ్పాటునందించిన పోలీస్ మానవత్వానికి కృతజ్ఞతలను తెలియజేశారు. దీంతో మస్తాన్ సేవలను ఎస్పీ అభినందించి క్యాష్ రివార్డును ప్రకటించారు.

పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం



సుబ్బారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సినీ దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడారు. కళామతల్లికి విశిష్ట సేవలందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్‌రాజును అభినందించారు. అనంతరం రంగస్థల నటుడు వల్లకవి సుబ్బారావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. సరస్వతి పద్మజ, షబ్బీర్, డాక్టర్ లక్ష్మీశ్రీనివాసశర్మ, వెంకటేశ్వర్లురాజు, ఉష, గులామ్‌హుస్సేన్, సుబ్బారాయుడు, వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, మహర్షి, సాగర్‌కు విశిష్ట సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు హజరత్తయ్య, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, మదీనా వాచ్ గ్రూప్స్ అధినేత ఇంతియాజ్, ప్రదీప్, అందె శ్రీనివాసులు, రియాజ్‌బాషా, చంద్రశేఖర్‌రెడ్డి, రవి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



నెల్లూరు(బృందావనం): జిల్లాలో బ్రాహ్మణుల సంక్షేమానికి ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కృషి చేస్తుందని సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ముప్వా ప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని కొత్త వారి సత్రంలో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా జ్వాలాపురం శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా గురుమూర్తి, కోశాధికారిగా కొత్త సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జ్వాలాపురం శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట

- ఇష్టానుసారంగా వదిలేసిన స్క్రాప్
- మాయమవుతున్న ఇనుప సామగ్రి
- జీజీహెచ్‌లో ఇదీ పరిస్థితి



ఓపీ భవనం వెనుకవైపు వదిలేసిన ఇనుప సామగ్రి

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. రూ.లక్షల విలువైన స్క్రాప్ సామగ్రిని చెట్ల పొదలు, పలు భవనాల వెనుక ఇష్టానుసారంగా వదిలేశారు. వాస్తవానికి ఆస్పత్రిలో మరమ్మతులకు గురై వినియోగానికి పనికిరాని ఇనుప కుర్చీలు, బీరువాలు, వీల్ చైర్లు, స్ట్రెచర్, మంచాలకు సంబంధించిన ఖరీదైన పైపులు టన్నుల కొద్దీ ఉన్నాయి. అయితే ఓపీ భవనం, ప్రసూతి ఆస్పత్రి వెనుక వైపు, రోగులకు ఆహారం తయారు చేసే భవన సమీపంలో ఎక్కడపడితే అక్కడ చెట్ల పొదల్లో దర్శనమిస్తున్నాయి. పలు గదుల్లో సైతం ఇనుప సామగ్రి ఉంది. వీటిని వేలం లేదా టెండర్ ద్వారా విక్రయిస్తే ఆస్పత్రికి రూ.లక్షల్లో ఆదాయమొచ్చే అవకాశం ఉంది.

మాయం చేస్తున్న వైనం

మరోవైపు ఏడాదిన్నర క్రితం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పలు గదుల్లో ఉన్న మెటీరియల్‌ను కొంతమేర తీసుకెళ్లారు. అయితే ఏమి జరిగిందో ఏమో గానీ పూర్తిస్థాయిలో స్క్రాప్‌ను తరలించలేదు. దీంతో ఇనుప మెటీరియల్‌ను రాత్రి వేళ కొందరు కొంచెం.. కొంచెంగా మాయం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సామగ్రిని కాపాడి టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే లక్షలాది రూపాయలు ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీకి సమకూరుతాయని డాక్టర్లు పేర్కొంటున్నారు.



ప్రసూతి ఆస్పత్రి వెనుక వైపు ఇలా..



సాయి భోజన ట్రస్ట్ ఎదుట దర్శనమిస్తున్న వస్తువులు

చీరలు, దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో దివ్యాంగులు, వృద్ధులకు చీరలు, దుప్పట్లను దివ్యాంగుల ఐక్య సంఘ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. పేదల వైద్యుడు నరసాపురం ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి ఆయన్ను సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, జక్కావుల్లా, ప్రసాద్, మహ్మద్ గౌస్, రేష్మా, పర్వీన్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యులకు శిక్షణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని డీసీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకారశాఖ అధికారి గుర్రప్ప మాట్లాడారు. తోటపల్లిగూడూరు మండలంలో స్వయం సహాయక సభ్యులు వ్యవసాయ అనుబంధ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఇందులో భాగంగా వీరికి శిక్షణ ఇచ్చామని వివరించారు.

విద్యార్థులకు శుభ్‌దిన్ భోజన్



కొండాయపాళెంలోని మున్సిపల్ పాఠశాలలో..



జెడ్పీ హైస్కూల్లో..

నెల్లూరు (టౌన్): శిక్షా సప్తాహ్‌ను పురస్కరించుకొని కొండాయపాళెం దళితవాడలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు మాట్లాడారు. జాతీయ విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించామని వివరించారు.

- పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు తిథి భోజనాన్ని అందజేశారు. అరటి పండ్లు, పెరుగును పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, మిత్ర బృందం.. గుగ్గిళ్లను ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు అందజేశారు. విద్యాశాఖ ఏడీ విజయ్‌కుమార్, ఎంఈఓ – 2 మురళీధర్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్ట్ 15 నాటికి అన్న క్యాంటీన్లు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో అన్న క్యాంటీన్ల పనులను వేగవంతం చేసి ఆగస్ట్ 15 నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని ఇంజినీరింగ్ విభాగాధికారులు తెలిపారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పనులను కమిషనర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ విభాగాధికారులు సోమవారం పరిశీలించారు. క్యాంటీన్ల ప్రాంగణాలను శుభ్రం చేసి, నిర్వహణకు అవసరమైన విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులను కల్పించనున్నామని వివరించారు.

ఘన సన్మానం



నెల్లూరు(దర్గామిట్ట): ఫ్లాగ్ డేను పురస్కరించుకొని జిల్లా నుంచి ఎక్కువ మొత్తంలో సేకరించి సైనిక సంక్షేమ నిధికి అందజేసిన మెప్మా పీడీ రవీంద్ర, డీఈఓ రామారావును కలెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ బోర్డు చైర్మన్ ఆనంద్ అభినందించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వీరిని సత్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మెప్మా పీడీ రూ.6.57 లక్షలు.. డీఈఓ రూ.3.3 లక్షలను సేకరించి సైనిక సంక్షేమ నిధికి అందజేశారని వివరించారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన లైసెన్స్‌ల మంజూరు



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు లైసెన్స్‌లను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సంబంధించిన జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం నిర్వహించారు. నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, జిల్లా సహకారాధికారి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌ఖాన్ పార్కులో పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని 44వ డివిజన్ పరిధిలో గల మహబూబ్‌ఖాన్ పార్కు ప్రాంగణాన్ని ఎంహెచ్‌ఓ చైతన్య సోమవారం పరిశీలించారు. పార్కులోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేయగా వచ్చిన నీటిని రోడ్డుపై నుంచి తొలగించాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నాన్ని చల్లాలని ఆదేశించారు.

పోర్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

నెల్లూరు(దర్గామిట్ట): రామాయపట్నం పోర్టును త్వరగా పూర్తి చేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు లోక్‌సభలో ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రామాయపట్నం వద్ద రూ.3,736 కోట్ల వ్యయంతో ఫేజ్ – 1ను చాలా కాలం క్రితమే పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. బ్రేక్ వాటర్ పనులు గత సెప్టెంబర్‌లోనే పూర్తి కావాల్సి ఉందని, అయితే పనులు దాదాపు నిలిచిపోయాయని చెప్పారు. పనులను పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ కేసు బనాయించడం దారుణం

నెల్లూరు (లీగల్): ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కోఆర్డినేటర్, న్యాయవాది గవాస్కర్‌పై బనాయించిన అక్రమ కేసును తక్షణమే ఎత్తేయాలని పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి కోరారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో గవాస్కర్‌ను ఇరికించడం దారుణమని చెప్పారు.

లక్ష్మీనృసింహుడి సేవలో..



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని ఇండియన్ కోస్ట్ గార్డ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, విశాఖపట్నం రాజేష్ మిత్తల్ సోమవారం దర్శించుకున్నారు. ఈఓ గిరికృష్ణ, ఆలయాధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం విశేష పూజలు చేశారు. ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

అర్చకుడికి బిరుదు ప్రదానం

నెల్లూరు సిటీ: పెద్దచెరుకూరులోని బాలాత్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థాన ప్రధానార్చకుడు నూతలపాటి సుబ్బయ్యశాస్త్రిని తెలంగాణలోని నార్కెట్‌పల్లిలో సోమవారం సత్కరించారు. జాతీయ శైవాగమ సదస్సులో ఆయనకు ఆగమ వాస్తుశేఖర బిరుదును ప్రదానం చేశారు.

యోగా పోటీల్లో ప్రతిభ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చెన్నైలో పద్మం యోగా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సౌతిండియా యోగా పోటీల్లో నెల్లూరీయులు ప్రతిభ చూపారు. 56 ఏళ్లకుపైబడిన పురుషుల కేటగిరీలో రఘురామయ్య ద్వితీయ, ప్రభాకర్‌నాయుడు తృతీయ, దయాళ్ దాస్ ఐదో స్థానంలో నిలిచారని యోగా మాస్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు.

కొత్త ఏజెన్సీలు 31లోపు సంప్రదించాలి

నెల్లూరు (టౌన్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ సర్వీసెస్ ఏజెన్సీ గడువు ముగుస్తుండటంతో ఆసక్తి గల కొత్త ఏజెన్సీ నిర్వాహకులు ఈ నెల 31లోపు ఉప రవాణా కమిషనర్‌ను సంప్రదించాలని డీటీసీ చందర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించండి



అర్జీలను స్వీకరిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రాంగణంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీల పరిష్కారం కోసం తరచూ తిప్పుకోకుండా చూడాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేసి అవసరమైన రక్షణ చర్యలను చేపడతామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల స్థితిగతులపై విభాగాల వారీగా అధికారులతో సమీక్షించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

50 అర్జీల సమర్పణ

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 50 అర్జీలు అందాయని కమిషనర్ వెల్లడించారు. అదనపు కమిషనర్ శర్మద, ఎస్‌ఈ సంపత్‌కుమార్, సిటీ ప్లానర్ దేవీకుమారి, ఆరోగ్యాధికారి చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు యజమాని మోసగించారు



మాట్లాడుతున్న రైతులు

నెల్లూరు(క్రైమ్): తమ వద్ద రూ.కోట్ల విలువజేసే ధాన్యాన్ని తీసుకొని నగదును ఇవ్వకుండా మిల్లర్ మోసగించారని, విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు, దళారులు కోరారు. రైస్‌మిల్లు యజమాని శేఖర్‌బాబుపై రైతులు, దళారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణకాంత్‌కు వినతిపత్రాన్ని సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 434 మంది రైతులు పండించిన రూ.4.66 కోట్ల విలువజేసే ధాన్యాన్ని కొత్తకాలువకు చెందిన రైస్‌మిల్లు యజమాని శేఖర్‌బాబు అప్పు ప్రాతిపదికన కొనుగోలు చేశారని చెప్పారు. రోజులు గడుస్తున్నా ధాన్యం తాలూకు నగదును ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దీంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లు యజమానిపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని చెప్పారు. ముత్తుకూరు రోడ్డు, నారాయణరెడ్డిపేటలోని పలువురు రైస్‌మిల్లర్లు, కావలిలోని డీలర్‌కు బకాయి ఉండటంతో రైతుల ధాన్యాన్ని వారు తీసుకెళ్లారనే విషయం విచారణలో వెల్లడైందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని చెప్పారు. కాగా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఎస్పీ ఆదేశించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలకు వినతి



మాట్లాడుతున్న సిద్ధేశ్వరమ్మ

నెల్లూరు(క్రైమ్): తన భర్త బుజ్జిరెడ్డిపై దాడి చేసిన స్కూల్ యాజమాన్యం, సిబ్బందిపై చర్యలు చేపట్టాలని అనంతసాగరం మండలానికి చెందిన సిద్ధేశ్వరమ్మ కోరారు. ఈ మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణకాంత్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేసి దాడికి దారితీసిన పరిస్థితులను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. తమ కుమార్తె అనంతసాగరం మండలం ముస్తాపురం అలుగు సమీపంలోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో చదువుతోందని చెప్పారు. ఫీజు కట్టేందుకు ఈ నెల 26న పాఠశాలకు వెళ్లారని, కుమార్తె చదువు విషయమై ప్రశ్నించగా, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, సిబ్బంది దాడి చేశారని చెప్పారు. గాయపడిన తన భర్త నడవలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. తమకు అధికార పార్టీ అండదండలున్నాయని, దిక్కున్న చోట చెప్పుకోమంటూ తమను మల్లికార్జున బెదిరిస్తున్నారని ఆరోపించారు. కాగా తగు చర్యలు చేపడతామని ఎస్పీ హామీ ఇచ్చారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటం



నెల్లూరు(బారకాసు): జిల్లాలోని జర్నలిస్టుల తరపున నిరంతరం పోరాడేందుకు ఏపీయూడబ్ల్యూజే ముందుంటుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరు వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ.. జీఓలతో సంబంధం లేకుండా అర్హులకు అక్రిడిటేషన్లు.. ఇళ్ల స్థలాలు.. ప్రెస్‌క్లబ్ మరమ్మతులకు నిధులను కేటాయించాలని కోరారు. ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి ఖాజా, ప్రింట్ మీడియా కోశాధికారి హనోక్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, దయాశంకర్, నాగరాజు, సహాయ కార్యదర్శి నరేంద్రబాబు, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, రహమతుల్లా, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గోవులకు సరిపడా ఆహారాన్నివ్వాలి



వినతిపత్రమిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉన్న గోవులకు సరిపడా ఆహారాన్ని అందించేలా దేవదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జొన్నవాడలోని కామాక్షితాయి దేవస్థాన అన్నదాన కేంద్రానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఆంక్షల్లేకుండా భోజన సదుపాయాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నేతలు నరాల సుబ్బారెడ్డి, లక్ష్మణ్‌రావు, నాగేంద్రసింగ్, కాళంగి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో అసోసియేషన్ నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు సోమవారంతో ముగిశాయి. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్ – 11, 13, 15, 17, 19, మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

విజేతలు వీరే..

- అండర్ – 11 బాలుర సింగిల్స్‌లో నాగసాయి భరత్, బాలికల్లో నిత్య, బాలుర డబుల్స్‌లో నాగసాయి భరత్, యశ్విన్.
- అండర్ – 13 బాలుర సింగిల్స్‌లో వర్షిత్, బాలికల్లో లతారెడ్డి, బాలుర డబుల్స్‌లో వర్షిత్, మహేందర్‌రెడ్డి, బాలికల్లో లత, నిత్య.
- అండర్ 15 బాలుర సింగిల్స్‌లో కార్తీక్, బాలికల్లో సుష్మారెడ్డి, బాలుర డబుల్స్‌లో షాహిర్, రాధాకిషన్, బాలికల్లో దీప్తి, సుదీప్తి.
- అండర్ – 17 బాలుర సింగిల్స్‌లో కార్తీక్, బాలికల్లో సుష్మ, బాలుర డబుల్స్‌లో అనంత్, రేవంత్, బాలికల్లో జాహ్నవి, లక్ష్మీప్రియ.
- అండర్ – 19 బాలుర సింగిల్స్‌లో మహేంద్ర, బాలికల్లో సుష్మ, బాలుర డబుల్స్‌లో ఆదిత్య, కుమారశ్రీ, మెన్ సింగిల్స్‌లో మహేంద్ర, డబుల్స్‌లో రూపేష్, యశ్వంత్ విజేతలుగా నిలిచారు.

వీరిని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అభినందించి జ్ఞాపికలను అందజేశారు. వీరు వివిధ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. అసోసియేషన్ కోశాధికారి ఇమ్మిడిశెట్టి శ్రీకాంత్, సభ్యులు మద్దిపాటి ప్రసాద్‌రావు, తాళ్లపాక వరప్రసాద్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, విజయ్ కుమార్, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈఈలుగా పదోన్నతులు



శ్రీధర్



శేషారెడ్డి

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ పరిధిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరికి ఈఈలుగా పదోన్నతి కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులను సోమవారం జారీ చేశారు. ఏకేనగర్ సబ్ డివిజన్ డీఈఈ శ్రీధర్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ట్రెయినింగ్ సెంటర్ డీఈఈగా పనిచేస్తున్న శేషారెడ్డికి ఎం అండ్ పీ – 2 నెల్లూరులో ఈఈగా పోస్టింగ్ ఇచ్చారు.